# యమసందర్శనం

"వీరే యమధర్మరాజుగారు!" అన్నారు భటులు.

వెంటనే నేను ఆయనకు సాష్టాంగ దండప్రమాణం ఆచరించి లేచి "మహాత్మా, మిమ్మల్ని చూడటంవల్ల నాజన్మ ధన్యమయింది!" అన్నాను.

"అబ్బాయీ, నా దగ్గిర అంత కపటవినయం నటించనవసరంలేదు. మనలో మనం హృదయం విప్పి మాట్లాడుకోవచ్చును. అట్లా కూర్చో!" అంటూ ఆ న్యాయమూర్తి తన ఆసనం పక్కనే నన్ను కూర్చుంద నియోగించాడు.

"అవునండీ, తమ దర్శనం అతిదుర్లభమని వింటాను. నాకది ఇంత సులభంగా ఎట్లా లభ్యమయిందో, తమరు నామీద ఇంత పక్షపాతం వహించి ఇంత దయయెందుకు చూపుతున్నారో నేను అర్థం చేసుకోలేకుండా ఉన్నాను" అన్నాను.

"దానికి రెండు కారణాలున్నై. ఒకటి – నువ్వింకా అధికారరీత్యా నా శాసనంలోకి వచ్చినవాడివికావు; ప్రస్తుతం నువు నాకు అతిథిమాత్రుడివి. రెండు – నువు రచయితవు, నన్ను గురించి నాలుగు మంచిముక్కలు రాయవలిసినవాడివి. మీ రచయితలున్నారే, మహాచెడ్డవాళ్ళు. ఇతర ప్రాణికోటి మాదిరిగా మాబోటి గాళ్ళమీద భయభక్తులతో ఉండనే ఉండరు. మీరంతా మీ చక్రవర్తులనూ, ప్రతినిధులనూ, అమాత్యులనూ ఏమంత గౌరవిస్తున్నారు చెబుదూ!"

యముడంతవాడు కూడా ఇట్లా మాట్లాడటం ఆశ్చర్యం వేసింది.

"నువ్విట్లా ఆశ్చర్యపడకు!" అన్నాడు యముడు నా అభిప్రాయం అర్థం చేసుకుని. "ఎవరూ నాయందు విశ్వసించకపోతే నేనిక్కడ ఎట్లా ఉంటాననుకున్నావు? ఇక్కడకి వచ్చిన జీవులు కూడా పరిమితకాలం ఉండటానికి కారణం అదే. ఆ జీవులను గురించి భూలోకవాసులు సంపూర్ణంగా మరిచిపోగానే వారు అదృశ్యులైపోతారు. మీరంతా మరిచిపోకుండా ఉన్న మహాత్ములు – వ్యాస వసిష్ఠ విశ్వామిత్రాది ఋషులూ, ప్రహ్లాదాంబరీషాది భక్తులూ, రామకృష్ణ వివేకానంద హరనాథాది అవతార పురుషులూ, మనువులూ – అంతా ఇంకా ఇక్కడే ఉన్నారు. చూడరాదూ?" అంటూ ఆయన తన సభను అలంకరించిన వారికేసి చూపాడు.

సభా భవనం చుట్టూ కలయచూసి నేను ఆశ్చర్యపోయినాను. మొదట్లో అంతమంది అక్కడ ఉన్న సంగతే గమనించలేదు. అందరినీ గుర్తించగలిగాను. ఇంకొకటి కూడా జరిగిందనుకుంటాను. నేను ఎవరికోసం వెతికితే వారల్లా కనిపించారు. ఎవరూ నామనులో లేనప్పుడు అక్కడ ఎవరూలేరేమో!

"కాని, అయ్యా! తమ భటులు నాకు యమలోకమంతా చూపినపుడు నేను దొరలను గాని ఇతర పాశ్చాత్యులను చూసినట్టు జ్ఞాపకం రావటంలేదే!" అన్నాను.

"నే చెబుతున్న దేమిటి? వాళ్ళంతా ఇక్కడే ఉన్నారు కాని వాళ్ళకు కావలసిన విధంగా కనిపిస్తుంది ఈ లోకం. వాళ్ళకు నా పేరుగాని ఆఖరుకు నేనెట్లా ఉంటానో కూడా తెలియదు. అందాకా ఎందుకూ? ఇతర దొరలంతా హాయిగా బీరు త్రాగి ఆనందిస్తుంటే, డాంటే అనే ఆయిన బియాట్రిస్ అనే దొరసాని కోసం సప్తాస్నుల మధ్య తన్నుతాను బంధించుకుని బయటికి రాకుండా ఉన్నాడు. ఇంకా ఆయనకు బియాట్రిస్ దొరకనేలేదు.

"పాపం? ఎప్పటికన్నా దొరుకుతుందా?"

"ఇక ఒకటే దొరకటం! ఎప్పటికైనా ఆయన రాసిన గ్రంథం రూపు మాయాలి; అప్పటికి వదులుతుంది ఆయనకీ భ్రమ."

"నిష్కారణంగా ఆయన్ను అట్లా బాధపెట్టటం మీ ధర్మానికి ఏ మాత్రమూ వన్నె తీసుక రావటంలేదు." అన్నాను.

"ఇదీ మరీ బాగుంది! ఆ బాధ ఆయన అహంకారాన్ని ఎట్లా ఉపశమింప జేస్తున్నదో, బాధపడటం ఆయనకెంత ఇష్టంగా ఉందో నీకు తెలుసునా ఏమిటి?" అన్నాడు యమధర్మరాజు కుపితుడై.

"సరే పోనివ్వండి నా కెందుకు?....వీరంతా ఎవరండోయ్?"

ఒక పెద్ద తూగుడి భీభత్సంగా రోదనాలు చేసుకొంటూ బొబ్బలు పెడుతూ అక్కడికి వచ్చింది. వారిని బల్లాలతో పొడుస్తూ, గదలతో మొత్తుతూ, కొరడాలతో కొడుతూ, తోస్తూ, మట్టిలాగులవాళ్ళు, కోరలవాళ్ళు భయంక రాకారులు వచ్చారు.

"వీరంతా పాపులు, మృతులు. వీరిని విచారణచేసి ఒక్క క్షణంలో పంపేస్తాను" అంటూ యముడు వారికేసి తిరిగాడు. అంతలోనే ఆయన స్వరూపం కూడా అమిత భయంకరంగా మారిపోయింది.

యమధర్మరాజు ఒక్కొక్కరినే విచారణ ప్రారంభించాడు. ఆ వచ్చిన వారంతా యముడంటే భయం కలవారే. అందరూ గజగజా వణికిపోతున్నారు. పాపం! వారిలో నిష్టపరులూ, దైవభక్తులూ, సనాతనులూ ఉన్నారు. మొదట వారిని చూసి ఆశ్చర్యపడ్డాను. కాని తరవాత యమధర్మరాజు చెప్పిన సూత్రం జ్ఞాపకం వచ్చింది. ఎంత మంచిగా జీవించినా నరకప్రాప్తి తప్పదని వారి నమ్మకం. వారి నమ్మకం ప్రకారమే జరుగుతున్నది. ఆశ్చర్యమేమిటీ?

మృతులలో కొద్దిమంది సనాతనులూ సద్ధర్మపరులూ పోగా మిగిలిన వారంతా వారి విశ్వాసాలకు గురి అయిన దౌర్భాగ్యులు. భయపడుతూ తప్పు చేసినవారు.

వారినిచూస్తే జాలివేసింది. హత్యలు చేసినందుకూ, రంకుతనాలు చేసినందుకూ, దొంగతనం చేసినందుకూ, మాంసభక్షణ చేసినందుకూ వారిని యముడు నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తున్నాడు; వేలకువేల సంవత్సరాలు తప్తతైలమూ, నరకకూపాలూ, రంపపు కోతలూ విధిస్తున్నాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది. నేను ఉద్రేకంతో లేచి, "యమధర్మరాజా, ఆగు!" అన్నాను.

అందరూ ఒక్కసారిగా నావంక చూశారు.

"నీకు న్యాయమనేది తెలుసునా? నేను సోషలిస్టును. ప్రొలిటేరియనులను నువిట్లా బాధపెడితే నేను సహించను. తెలిసిందా? నేను డబ్బును పంచాలనే తత్వంవాణ్ణి. పాపాన్ని పంచు! డబ్బుకంటె పాపం ఉందా ఏమిటి?

"వాడు దొంగతనం చేశాడంటే ఆ దొంగతనానికి సంపూర్ణంగా వాడే బాధ్యుడా? అట్లా వచ్చేటట్టయితే ఏ పనికి ఎవరిని సంపూర్ణంగా బాధ్యుణ్ణి చేస్తావో చెయ్యి, చూస్తాను. మా రచయితలవంటి వాళ్ళమే ఎప్పుడు ఎవరి రచనలో ఏ భాగం తస్కరిస్తామో, మా రచనకు మేం ఎంతవరకు బాధ్యులమో తెలీదే! పాపం, ఆ భ్రష్టులు వారు చేసే కర్మకు ఉత్తరాధికారులా?.... చూడు, నిన్ను గురించీ, నీ వెధవలోకం గురించీ ఏం రాస్తానో!" అని అరిచాను.

ఒక్కసారిగా సభాభవనమంతా అల్లకల్లోలమై పోయింది. పెద్ద గడ్డాల మహర్షులూ మనువులూ ఒక్కసారిగా లేచి "చంపండి, నాస్తికుణ్ణి! బతికి ఉండగానే కుంభీపాకంలో తోసి తలుపులు బిగించండి! పట్టుకోండి! పోనివ్వకండి! పట్టుకోండి!" అని భయంకరంగా అరవసాగారు.

అందరూ నాకేసి చూస్తున్నారు— యముడు కూడా! ఆ మొహాలన్నీ భయంకరంగానే ఉన్నై. ఒక్క మొహంలో కూడా నామీద సానుభూతి లేదు.

నా గుండె అవిసిపోయింది. ముచ్చెమటలు పోసినై. ఏం చేస్తున్నానో నాకే తెలియదు. కాలిబలంకొద్దీ పరిగెత్త సాగాను. మంచుగడ్డకన్న చల్లని చేతులు నన్ను పట్టుకో వస్తున్నై. వాటి స్పర్శ పాము స్పర్శకంటె కూడా కంపరం కలిగిస్తున్నది. ఇంకా వేగంగా— ఇంకా వేగంగా పరిగెత్తుతున్నాను!....

అంతా నిశ్శబ్దం. ఏ చప్పుడూ లేదు. చుట్టూ కలయచూశాను. అంతా నిరామయంగా ఉంది.

ఇంతలో ఎవరో నన్ను పేరుపెట్టి పిలిచారు.

"ఎవరు వారు?"

"నేనే! యముణ్ణి! నీకు సరి అయిన ఆతిథ్యం ఇవ్వలేకపోయినందుకు చింతగా ఉంది. తప్పు నీదే సుమా!"

"నాదా! నాదా తప్పు?" అంటూ ఆయన కోసం చుట్టూ చూశాను. ఆయన ఎక్కడా కనబడలేదు. మాట మాత్రం ఎక్కణ్ణించి వస్తున్నదీ అంతుపట్టకుండా వినిపిస్తున్నది.

"తప్పు నీదికాదా మరి? అతిథిగా వచ్చిన వాడివి ఊరికే ఎందుకుండలేక పోయినావు?"

"ఆ గడ్డాల వాళ్ళంతా నామీద ఎందుకు విరుచుకు పడాలీ? నేను చెప్పింది రైటా? వాళ్ళు చెప్పింది రైటా?"

"వాళ్ళ విశ్వాసాలు రయిటయి ఉండవచ్చుననే సంశయం నువ్వే మాత్రమో కలిగి ఉండకపోతే నిన్ను వారు భయపెట్టగలిగి ఉండరు!" అన్నాడు యముడు.

"ఆ మాట మాత్రం అబద్ధం. వాళ్ళు చెప్పిందంతా అబద్ధమనీ, వాళ్ళకు న్యాయమనేది ఏమీ తెలియదనీ నాకు స్పష్టంగా తెలుసును. నేనన్న మాటలు అక్షరాలా నిజం. ఆ విషయంలో నా విశ్వాసం మారదు."

"ఇప్పుడదంతా నిజమే. ఆ క్షణంలో నీకింత నిబ్బరం లేకపోయింది. అందుకనే నీలో అంత ఉద్రేకం కలిగింది. నీ విశ్వాసంలో నీకు విశ్వాసం చాలనప్పుడే ఉద్రేకం జతపరచవలిసి వస్తుంది. నిజమైన సత్యానికి సమర్థింపు కావాలా?"

సత్యాన్ని అవతలవాళ్ళు తోసివేస్తున్నప్పుడు—"

"అదీకాకా—

"నేను మొదటనే చెప్పాను. నా లోకాన్ని గురించి నీకెటువంటి విశ్వాసాలుంటే అట్లాగే కనిపిస్తుందని. నేను అన్యాయం చేస్తున్నాననే సమ్మకం నీలో లేకపోతే నీకు అన్యాయం కనిపించి ఉండదు. నా లోకంలో అన్యాయం జరుగుతున్నదనే విశ్వాసం నీలో పైకి రాగానే నీ న్యాయానికి నా లోకంలో స్థానం లేకపోయింది. నీ న్యాయంలో నీకు విశ్వాసం ఉన్నంతసేపూ నీకు సరిఅయిన ఆతిథ్యమే జరిగింది. పోయివస్తాను?"

(ప్రథమ ముద్రణ : మార్చి 1939, ఇల్లరికం కథల సంపుటి,
తెనాలి : యువ కార్యాలయం)